క్లుప్తంగా

కాలువ గట్టు రోడ్డు మరమ్మతులు



నారాయణపురం కాలువ గట్టు రోడ్డులో గుంతలు పూడుస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: నారాయణపురంలో ప్రధానమైన కాలువపై వంతెనకు మరమ్మతులు చేయడంతో రాకపోకలు స్తంభించిపోయిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో వాహనాలను కాలువ గట్టు రహదారి తల్లాపురం రహదారి మీదుగా పుంత రహదారి మీద నడుస్తున్నాయి. దీంతో ఆ రహదారులు ధ్వంసం అయ్యాయి. గుంతలు పడి, పూర్తిగా పాడైపోయాయి. ఈ పనులను ఎమ్మెల్యే ధర్మరాజు పర్యవేక్షిస్తున్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన



వల్లూరులో ఎలుక బొరియలను గుర్తిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గణపవరం: గణపవరం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ నెల 12వ తేదీ శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. అన్ని రైతుసేవా కేంద్రాల వద్ద ఎలుకల మందు, నూకలు, నూనెతో కలిపిన ఎరను రైతులకు అందిస్తామన్నారు. రైతులు ఒకేసారి ఎలుకల మందును పెట్టాలన్నారు. ముందుగా తెరిచి ఉన్న బొరియలను గుర్తించి ఆ బొరియల్లో ఎలుకల మందును పెట్టి పూడ్చి వేయాలని సూచించారు. మండలానికి 60 కిలోల బ్రోమోడయోలిన్ మందు వచ్చిందని, దీనిని నూనె, నూకలతో కలిపి రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు.

పీ-4 సర్వేపై సమీక్ష

దెందులూరు: పీ-4 సర్వేపై సమీక్ష సమర్థవంతంగా జరగాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు సూచించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీ-4 సర్వేపై సూచనలు చేశారు. సమన్వయం ప్రణాళికతో లక్ష్యాలు సాధించాలన్నారు. క్షేత్ర స్థాయిలో రిసోర్స్ పర్సన్లు పథకం ప్రయోజనాలను వివరించాలన్నారు. రిసోర్స్ పర్సన్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

అధ్యక్షుల నియామకం

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉంగుటూరు నియోజకవర్గం వలంటీర్స్ విభాగం అధ్యక్షుడుగా జుత్తిగ కొండలరావు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షుడిగా మర్రిపూడి రత్నకుమారి, ఆర్టిజాన్ అధ్యక్షుడిగా యలమర్తి సుబ్బారావును నియమిస్తూ ఆదేశాలు విడుదల చేశారు.

నోటు పుస్తకాల పంపిణీ

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతిదేవి హైస్కూల్ ప్లస్‌లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను నాయకులు పంపిణీ చేశారు. యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.మహేష్ యాదవ్, సర్పంచ్ తోట ఏసమ్మ, దెందులూరు కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

5కే మారథాన్‌లో విజయమే లక్ష్యం

దెందులూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కోసం శుక్రవారం ఏలూరులో నిర్వహించే 5కే మారథాన్ రెడ్ రన్ నిర్వహించనున్నారు. ఈ రన్‌లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల అధ్యాపక విద్యార్థులు విజయం సాధిస్తారని ప్రిన్సిపాల్ నతానియేలు అన్నారు. గురువారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఏలూరు సీఆర్ఆర్ కళాశాల నుంచి ఇండోర్ స్టేడియం వరకు ఫైవ్‌కే మారథాన్ రెడ్ రన్‌ను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో తమ తమ కళాశాల వ్యాయామ అధ్యాపక విద్యార్థులు 43 మంది పాల్గొంటున్నారని తెలిపారు. మూడు విభాగాల్లో తప్పక విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నిత్యావసరాల పంపిణీ

భీమడోలు: నిరాశ్రయులను ఆదుకోవడమే మానవత్వమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ఆత్మీయ సహకార సేవ కమిటీ చైర్మన్ రామిశెట్టి గంగాధర్ అన్నారు. మండలంలోని వడ్లపట్ల, సూరప్పగూడెం గ్రామాల్లో ముగ్గురు ఆకాల మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిరాశ్రయులైన ఆ కుటుంబాలకు మానవత సేవా సంస్థ ప్రతినిధులు బియ్యం, వంట సరుకులు, నూతన వస్త్రాలను వితరణ చేశారు. మండల అధ్యక్షుడు అల్లాడ ప్రసాద్, కోశాధికారి జి.రమణశంకర్, రీజియన్ కో-చైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

వర్గోన్నతి సరే.. వసతులేవీ?

- అరకొర గదుల్లో ఉపాధ్యాయుల బోధన
- రెండేళ్లుగా నిలిచిపోయిన గదుల నిర్మాణం
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- ఇదీ బువ్వనపల్లి జెడ్పీ స్కూల్ పరిస్థితి

నిడమర్రు: విద్యార్థుల నమోదు ఆధారంగా పలు ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా వర్గోన్నతి చెందాయి. దీనిలో భాగంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ ఉన్న బువ్వనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు చదువుకునేలా పాఠశాల అప్‌గ్రేడ్ అయ్యింది. పాఠశాలలు తెరిచి 3 నెలలు కావస్తున్నా అవసరమైన మౌలిక వసతులు గానీ, తగిన ఉపాధ్యాయులు గానీ లేకపోవడంతో విద్యార్థుల చదువు కుంటు పడుతుందంటూ తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోరుకున్న ఉపాధ్యాయులు వెనక్కి

విద్యా సంస్కరణల్లో భాగంగా విద్యార్థుల నమోదు ఆధారంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 60 మంది పైగా విద్యార్థులు ఉంటే ఆ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా అధికారులు గుర్తించారు. ఈ స్కూల్‌కి ఒక ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుని పోస్టుతో పాటు నలుగురు సెంకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు మంజూరు చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఈ 5 పోస్టులు భర్తీ అయ్యాయి. కానీ ఒక సెంకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులో కోరుకున్న ఉపాధ్యాయుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, తిరిగి సిద్ధాపురం గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌కి డిప్యుటేషన్‌పై టీచర్‌గా పంపించారు.



ఒకే గదిలో మూడు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

9 మంది టీచర్లకు ముగ్గురే..

ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు నిబంధనల మేరకు విద్యార్థులుంటే జెడ్పీ స్కూల్‌గా పరిగణించి గ్రేడ్--2 హెచ్ఎం పోస్టుతో పాటు ఒక పీడీ టీచర్, 7 సబ్జెక్ట్ టీచర్లను కేటాయించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన బదిలీల్లో నిబంధనలకు అనుగుణంగా 7 పోస్టులను కేటాయించారు. దీంతో గణితం, భౌతికశాస్త్రం, సోషల్, హిందీ పోస్టులు భర్తీ అయ్యాయి. అయితే భర్తీ అయిన హిందీ పోస్టులోని టీచర్‌ను తిరిగి పాత స్కూల్‌కి డిప్యూటేషన్‌పై పంపించారు. ఇంగ్లిష్, జీవశాస్త్రం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాలేదు. దీంతో ప్రస్తుతం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న ముగ్గురు టీచర్లే 7 సబ్జెక్టులు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు పూర్తి స్థాయి సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో లేక పలువురు పాఠశాలను విడిచి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు.

నిలిచిన గదుల నిర్మాణం

వైఎస్సార్ సీపీ హయాంలో నాడు-నేడు ఫేజ్-2లో అదనపు గదుల నిర్మాణం ప్రారంభించారు. అయితే ఫేజ్-2లో మంజూరైన నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఆ నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ స్కూల్‌లో మోడల్ ప్రైమరీకి సంబంధించిన 5 తరగతులకు సరిపడా గదులు లేకపోవడంతో కేటాయించిన రెండు గదుల్లో 5 తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో అటు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇబ్బందిగా ఉన్నట్లు చెబుతున్నారు.

గదుల నిర్మాణం ప్రారంభించాలి



“గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యా సంస్కరణల్లో భాగంగా నాటి ఎమ్మెల్యే వాసుబాబు కృషితో ప్రాథమిక స్కూల్ నుంచి యూపీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. దీంతో అవసరమైన తరగతి గదులు నిర్మాణం ప్రారంభించారు. గతంలో ప్రారంభించిన గదుల నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-సంకు సత్యకుమార్, మాజీ ఎంపీటీసీ, బువ్వనపల్లి

విద్యా వలంటీర్లను ఏర్పాటు చేయాలి



గ్రామంలో హైస్కూల్ వచ్చిందని అందరూ సంతోషం వ్యక్తం చేశాం. కానీ తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం బాధాకరం. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేసే వరకైనా ఆయా సబ్జెక్టులకు సంబంధించిన విద్యా వలంటీర్లను ఏర్పాటు చేయాలి. గణపవరం లయన్స్ క్లబ్ ద్వారా పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన నోట్ పుస్తకాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తున్నాం.

-వెల్లంకి నరేష్, ఉప సర్పంచ్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

దెందులూరు: మండలంలోని 17 పంచాయతీల్లో 15,946 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ దెందులూరు మండలానికి 21375 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని, 15,946 పంపిణీ అయ్యాయని గ్రామాల్లో రేషన్ డీలర్లు రేషన్‌తో పాటు స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నారన్నారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు.

నిమ్మ సాగును ప్రోత్సహించండి



నిమ్మ సాగు చేస్తున్న రైతులు

దెందులూరు: మెట్ట గ్రామాల్లో నిమ్మ సాగును రైతులు ప్రోత్సహించాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ ఫాతిమా ప్రసన్న అన్నారు. గురువారం మండలం మేధినరావుపాలెం గ్రామంలో నిమ్మ సాగు మొక్కలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు రూ.1.46, 311 మూడు సంవత్సరాల నిర్వహణ నిమిత్తం జాతీయ ఉపాధి హామీ పథకం రైతు అకౌంట్‌కు నగదు జమ చేస్తారన్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు నిమ్మ సాగుకు ఉపాధి హామీ పథకం తోడ్పాటు అందిస్తున్న నగదును సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ దీప్తి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.జోషి, ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

పాలసానిపల్లి పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు



విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్న హెచ్ఎం శ్రీలక్ష్మీదుర్గ

భీమడోలు: పాలసానిపల్లి ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. ఇక్కడ పని చేస్తున్న ప్రధానోపాధ్యాయిని విద్యార్థులకు మెలకువలతో కూడిన విద్యాబోధన చేస్తూ ఆ కృత్యాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. వాటిని రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్షా కార్యాలయం అధికారులు గుర్తించి హెచ్ఎం చింతలపూడి శ్రీలక్ష్మీదుర్గకు గురువారం ఫోన్ చేసి అభినందించారు. దీంతో పాటు పాఠశాలలో నిర్వహించే అన్ని కార్యకలాపాలను రాష్ట్ర స్థాయిలో సోషల్ మీడియా అక్కౌంట్స్ ద్వారా షేర్ చేశారు. దీంతో ఆ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. పాఠశాలలోని విద్యార్థులకు వినూత్న తరహా బోధన చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. పాలసానిపల్లి గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చిన హెచ్ఎంను సర్పంచ్ షేక్ రహీమాబేగం, ప్రజాప్రతినిధులు, ఎంఈవో-1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎ.భాస్కర్‌కుమార్ అభినందించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి శుభాకాంక్షలు

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు కొమరేపల్లి గరుడ హోటల్‌లో గురువారం నిర్వహించారు. మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, జి.శ్రీనివాసనాయుడు, ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, పార్టీ నేత రాజీవ్ కృష్ణ, దెందులూరు ఉంగుటూరు, గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ మాజీ చైర్మన్లు, నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ మిథున్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

విద్యతో పాటు ఉపాధిపై అవగాహన

గణపవరం: విద్యార్థులు విద్యతో పాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని గణపవరంలోని ప్లస్‌టు బాలికోన్నత పాఠశాల హెచ్ఎం తోట సింహాద్రి అప్పారావు అన్నారు. గురువారం పాఠశాలకు చెందిన ఇంటర్ మీడియట్ విద్యార్థినులను ఒకేషనల్ ఉపాధ్యాయిని స్రవంతి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గణపవరంలోని పలు వ్యాపారసంస్థలను సందర్శించి వ్యాపార లావాదేవీలను పరిశీలించారు. ట్విల్స్ వస్త్ర వ్యాపార సంస్థలో పలు రకాల రెడీమేడ్ దుస్తులు, ఇతర వస్త్రాల అమ్మకాలు, ధరలు, తగ్గింపు ధరలు తదితర విషయాలపై మేనేజర్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధిని కల్పించే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఇలాంటి క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఒకేషనల్ విద్య వీసీలు నాగశివారెడ్డి, శ్రీను అన్నారు.



వ్యాపార సంస్థను సందర్శించిన బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

ఉద్యోగమేళాలో 11 మంది ఎంపిక

గణపవరం: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 11 మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎంపికైనట్లు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి తెలిపారు. డిగ్రీ కాలేజీ జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అపోలో ఫార్మసీ, పేటీఎం, బీటీఎస్ కంపెనీలు పాల్గొనగా అపోలో ఫార్మసీలో ముగ్గురు, పేటీఎంలో ముగ్గురు, బీటీఎస్‌లో ముగ్గురు అభ్యర్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన వారిని జేకేసీ కో-ఆర్డినేటర్ సీహెచ్ అనూరాధ, నాక్ కో-ఆర్డినేటర్ కేవీ గణేష్‌కుమార్, జేకేసీ మెంటార్ ఐవీఎల్ఆర్‌కే ప్రసాద్ తదితరులు అభినందించారు.



క్యాంపస్‌లో ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్

పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్

నిడమర్రు: పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన క్యాన్సర్ బారిన పడి విలువైన జీవితాన్ని కోల్పోతామని అందువలన పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డైట్ అధ్యాపకుడు చల్లా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన బువ్వనపల్లిలోని ఉన్నత పాఠశాల, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, పలు తరగతుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పొగాకు ఉత్పత్తుల వలన జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా సంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, ఖైనీ, గుట్కా వంటి క్యాన్సర్ కారక ఉత్పత్తులు అమ్మడం నిషేధమని, వీటిని అమ్మొద్దని సమీప వ్యాపారులకు నోటీసులు అందజేశారు. పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీ సుబ్బారావు, ఆదర్శ పాఠశాల హెచ్ఎం సీహెచ్ భారతీలక్ష్మీకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మహిళలకు రూ.1,500 ఎప్పుడో?

దెందులూరు: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఎప్పుడిస్తారని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పాలగూడెం గ్రామ సర్పంచ్ పి.సునీత అన్నారు. గురువారం జెడ్పీటీసీ లీలా నవకాంతం నివాసంలో వారు మాట్లాడారు. ఒక వైపు సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు నెలకు రూ.1500 పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న మహిళా ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే అమలు చేశారన్నారు. లక్షలాదిమంది మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం దృష్ట్యా కూటమి ప్రభుత్వం వెంటనే 1500 పథకాన్ని అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్



ఇండస్ట్రియల్ విజిట్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్ 60 మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం శర్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సాంకేతిక విద్య ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరని అన్నారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ ఎన్నిక

కామవరపుకోట: చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పరిశీలకుడిగా నల్లూరి ప్రభాకరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సూతగాని రామకృష్ణను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా సిలింతరాజుల సుబ్బారావు, చింతపల్లి రాజు, కుచలపాటి ప్రకాశం, వామిశెట్టి ఏసుబాబు, కార్యదర్శులుగా ఏలేటి చార్లెస్, పెనుమాకుల వీర్రాజు, కుచలపాటి ప్రకాశం, నైనవరపు సుబ్బారావులను ఎన్నుకున్నారు. గ్రామ అనుబంధ విభాగాలు సభ్యులుగా గ్రామ సోషల్ మీడియా కన్వీనర్‌గా వెలగలేటి సాయిరాజేష్, యువజన విభాగం అధ్యక్షులుగా చిన్నం శంకర్, మైనార్టీ విభాగం అధ్యక్షులుగా షేక్ హుస్సేన్, రైతు విభాగం అధ్యక్షులుగా పాముల సూరిబాబు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా పదిలం చిన సుబ్బారావు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రావికంపాడు ఎంపీటీసీ కనుమూరి అంజిరెడ్డి, కనుమూరి ప్రసాదరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు షేక్ మీరా సాహెబ్, పెంద్ర వెంకటేష్, శ్యామల శ్రీనివాస్ రెడ్డి, కాగితాల శ్రీను, సోర్న సింహాచలం, అన్నవరపు గణేష్, ఏలేటి గోతియ్య, షేక్ గలీషా పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ రావికింపాడు నూతన గ్రామ కమిటీతో కన్వీనర్ సత్యనారాయణ

16 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

భీమడోలు: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 16 మందిని ఎంపిక చేసినట్లు భీమడోలు ఎంఈవో-1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. గురుపూజోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలల స్కూలు అసిస్టెంట్లు ఐదుగురు, 10 మంది పీఎస్ హెచ్ఎంలు, ఎస్‌జీటీలు, ఒక ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఎంపిక చేశారు. ఎస్.అహ్మద్ ఎ.జయలక్ష్మి, కె.రాజమణి, ఎ.విజయలక్ష్మీ దేవి, జె.అనిల్ కుమార్, ఎం.విజయకుమారి, వీవీ కృష్ణవేణి. ఏ.మురళీకృష్ణ, ఎస్.మాధవి, ఆర్.విజయశాంతి, ఎం.రవిభారతి, తేరా సంధ్య, పి.రమాదేవి, పి.లక్ష్మీనారాయణ, వి.హరిరాజశేఖర్, మానస పాఠశాల ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్ర కుమార్‌లను ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేక అభినందన కార్యక్రమం జరుగుతుందని ఎంఈవోలు తెలిపారు.



ఎస్ఏ జె.అనిల్



ఎస్‌జీటీ హరి రాజశేఖర్

'పది'లమైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించిన ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: రానున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు సూచించారు. గురువారం ఉంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వికలాంగుల ప్రత్యేక టాయిలెట్లను పరిశీలించారు. అలాగే ఇతర సదుపాయాలు చూశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు తీసుకున్నారు. ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించొచ్చని ఆయన అన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఎరువుల వాడకంపై అవగాహన తప్పనిసరి

దెందులూరు: యూరియా, ఎరువుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు అన్నారు. గురువారం మండలంలోని రామారావుగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నత్రజని ఎరువులను నిర్దేశించిన మోతాదు కంటే ఎక్కువగా వాడడం వలన చీడ పీడల ఉధృతి ఎక్కువై పంటకు నష్టం కలుగుతుందని, తద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు పెరిగి, దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యు.సుందర్ కుమార్, పశు సంవర్ధక శాఖ జేవీఓ, పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

శిరోమణికి సంతాప సభ

ఉంగుటూరు: ఇటీవల చనిపోయిన ఎస్ఆర్ఐ డాక్టర్ నాగశిరోమణికి ఉంగుటూరులో సంతాప సమావేశం ప్రజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ఆమె చిత్రపటం వద్ద పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్, వంకినేని భాను ప్రకాష్, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.